సాక్షి
విజయనగరం

గురువారం । 4 । మే । 2023



విధి నిర్వహణలో అలసత్వం వద్దు

విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. - 8లో

అందరికీ ధన్యవాదాలు



విజయనగరం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా పర్యటనను విజయవంతం చేసిన జిల్లా ప్రజానీకం, అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామానికి చెందిన వలంటీర్ బి.అప్పలనాయుడు విజయవాడలో వైద్యం పొందుతున్న డయాలసిస్ పేషెంట్ బెజ్జివల్లి నారాయణమ్మకు బుధవారం రూ.10వేలు పింఛన్ అందజేశాడు.

సీఎం పర్యటనలో సైడ్‌లైట్స్

- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ప్రజల హర్షధ్వానాల నడుమ విజయవంతంగా సాగింది.
- బహిరంగ సభ జరుగుతున్న సమయంలో జోరు వర్షం కురిసినా సభావేదికలో ఉన్న ప్రజలు మాత్రం ఎవరి స్థానాల్లో వారు కదలకపోవడం గమనార్హం.
- సభా వేదిక వద్దకు ఉదయం 8 గంటల నుంచే ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.
- ముఖ్యమంత్రి సభా వేదికపైకి వచ్చిన సమయంలో ప్రజలంతా తమ హర్షధ్వానాలతో ఆత్మీయంగా పలకరించారు.
- సభలో మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ రూపొందించిన ప్లకార్డులను పలువురు మహిళలు ప్రదర్శించారు.
- ముఖ్యమంత్రి భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం, తద్వారా జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తున్న సమయంలో పలువురు యువకులు గ్యాలరీలో పూలు విసురుతూ జై జగన్ అంటూ నినదించారు.
- సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు చేపట్టింది.
- సభా ప్రాంగణంలోకి వచ్చిన ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో జిల్లా యంత్రాంగం సఫలమైంది.

ప్రపంచంతో ఉత్తరాంధ్ర అనుసంధానం




- కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్

విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ప్రపంచంతో ఉత్తరాంధ్ర అనుసంధానం కానుందని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ పేర్కొన్నారు. జిల్లాలో మూడు ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రావడం సంతోషదాయకమని సభా వేదికపై ప్రారంభోపన్యాసం చేశారు. మొదటి విడతలో రూ.4,592 కోట్లతో మొదలు పెడుతున్న విమానాశ్రయ నిర్మాణంతో తరతరాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కలుగుతుందని స్పష్టంచేశారు. పారిశ్రామికంగా, ఆర్థికంగా, సామాజిక అనుబంధ రంగాల్లో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవనుందని ఆకాంక్షించారు. నెల్లిమర్ల నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు మిగులు పనులను రూ.194.40 కోట్లతో చేపట్టేందుకు ఈ రోజే శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. పూసపాటిరేగ, డెంకాడ మండలాల పరిధిలో 24,710 ఎకరాలకు సాగునీరందడంతో పాటు భోగాపురం విమానాశ్రాయానికి , విజయనగరం కార్పొరేషన్‌కు నీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దశాబ్దాల వెనుకబడిన విజయనగరంలో మత్స్యకారుల అభివృద్ధేలక్ష్యంగా.. వారి చిరకాలవాంఛ అయిన చింతపల్లిలో రూ.23.74 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. తద్వారా మత్స్యకారుల వలసలు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనతో విజయనగరం జిల్లా అభివృద్ధికి చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం, ప్రజల తరపున ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎయిర్‌పోర్ట్ నమూనా ప్రదర్శన

- ఆసియాలోనే అతిపెద్ద విమానయాన నిర్మాణ సంస్థ జీఎంఆర్
- ప్రపంచ వ్యాప్తంగా 12 ఎయిర్‌పోర్టుల నిర్మాణం



చీపురుపల్లి: ప్రఖ్యాత విమానయాన నిర్మాణ సంస్థ జీఎంఆర్ ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసేందుకు బుధవారం వచ్చిన ఆయన భోగాపురం మండలంలోని సవరవల్లి వద్ద ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పరిశీలించారు. సీఎంకు జీఎంఆర్ సంస్థలు అధినేత గ్రంధి మల్లికార్జునరావు, ఆయన తనయుడు గ్రంధి కిరణ్‌లు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. భోగాపురంలో 2,203 ఎకరాల్లో రూ.4,600 కోట్లతో ఫేజ్-1లో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి జీఎంఆర్ ఏర్పాటు చేసిన మూడు నమూనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం జీఎంఆర్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ఇంత వరకు నిర్మించిన 12 ఎయిర్‌పోర్ట్‌లు, ఆసియాలోనే అతి పెద్ద విమానయాన నిర్మాణ సంస్థగా ఎదిగిన తీరును సీఎం జగన్‌మోహన్‌రెడ్డికు జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, ఆయన తనయుడు కిరణ్‌లు వివరించారు.



భోగాపురం మండలం సవరవిల్లి వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పాల్గొన్న మంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ , కలెక్టర్ నాగలక్ష్మి, జీఎంఆర్, ఎమ్మెల్యేలు



మళ్లీ వస్తా..

ప్రాజెక్టులన్నీ ప్రారంభిస్తా..

దశాబ్దాల కల సాకారమయ్యే వేళ... ఉత్తరాంధ్ర ప్రజలు మురిసిపోయారు. అభిమాన నేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భోగాపురం మండలం సవరవిల్లి వేదికగా.. ఉత్తరాంధ్ర దశాదిశను మార్చే మూడు ప్రాజెక్టుల పనులకు భూమిపూజ చేసిన సమయంలో చప్పట్లతో హర్షధ్వానాలు పలికారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, చింతపల్లి ఫిష్‌ల్యాండింగ్ సెంటర్, తారకరామతీర్థసాగరం ప్రాజెక్టు పెండింగ్ పనులు ప్రారంభించేందుకు వచ్చిన జననేతకు మద్దతుగా నిలిచారు. నెల్లిమర్ల నియోజకవర్గంపై వరాల జల్లు కురిపిస్తూ వివిధ అభివృద్ధి పనులకు రూ.52.8 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించడంతో ఉప్పొంగిపోయారు. పనులన్నీ సకాలంలో పూర్తిచేస్తామని, ప్రారంభానికి మళ్లీ వస్తానంటూ ఉద్ఘాటించిన సమయంలో జై జగన్ అంటూ గట్టిగా నినదించారు. మదినిండుగా స్వాగతించారు. అభివృద్ధి ప్రదాతకు అడుగడుగునా అండగా నిలిచారు. జోరువానలోనూ ప్రగతి ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమాలను 'విజయ'వంతం చేశారు.



ముఖ్యమంత్రి బహిరంగ సభకు పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలు

- భోగాపురం విమానాశ్రయం సహా ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తిచేస్తాం..
- వలసలకు చిరునామాగా ఉన్న ప్రాంతాన్ని జాబ్ హబ్‌గా చేస్తా
- 30 నెలల్లోగా ఈనేలపై నుంచి విమానాల రాకపోకలు
- జిల్లా ప్రజలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా
- ఉమ్మడి విజయనగరం జిల్లాపై అపార ప్రేమ చూపించిన జననేత
- జోరువానలోనూ నిర్విఘ్నంగా మూడు బృహత్తర కార్యక్రమాలకు శంకుస్థాపన
- సభాస్థలికి పోటెత్తిన ప్రజలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇన్నాళ్లూ వలసలకు చిరునామాగా ఉన్న విజయనగరం జిల్లాను జాబ్‌హబ్‌గా మారుస్తానంటూ ఉత్తరాంధ్రపై ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాపై అపార ప్రేమను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చూపించారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ఆయన చిత్తశుద్ధిని చూసి ప్రజలు జేజేలు పలికారు. ప్రత్యేక అభిమానం చూపించడంలో తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని మరపించారంటూ మురిసిపోయారు. వర్షం ఒకవైపు ఆగకుండా జోరున కురుస్తున్నా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. తమ ప్రాంత అభివృద్ధికి ఒక్కోవరాన్ని వరుసగా ప్రకటిస్తుంటే ఉప్పొంగిపోయారు. గతంలో ఐదేళ్లూ పాలించిన చంద్రబాబు మాదిరిగా టెంకాయ కొట్టేసి వెళ్లిపోకుండా అన్ని ప్రాజెక్టులూ పూర్తయిన తర్వాత మళ్లీ వచ్చి తానే ప్రారంభిస్తానంటూ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతుంటే సభలో ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. మాట తప్పని, మడమ తిప్పని ఆయన విధానంపై జేజేలతో తమ విశ్వాసాన్ని ప్రకటించారు. ఇలా ప్రజల అభిమానం , దేవుడి ఆశీర్వాదం ఉన్నంతవరకూ తనపై ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఏమీ చేయలేరని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు.

అట్టహాసంగా శంకుస్థాపనలు

భోగాపురం మండలంలో రూ.4,592 కోట్లతో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, పూసపాటిరేగ మండలంలో రూ.23.73 కోట్లతో చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి, రూ.194.4 కోట్ల తో తారకరామతీర్థసాగరం ప్రాజెక్టు పెండింగ్ పనుల పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఉదయం 10.15 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో ఎ.రావివలస వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయనకు విజయనగరం జిల్లాతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సీఎం సందర్శించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను పరిశీలించారు. దీని ప్రత్యేకతలను జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఎంఆర్ గ్రూపు అధినేత గ్రంధి మల్లికార్జునరావు (జీఎంఆర్) వివరించారు. తర్వాత 10.45 గంటలకు మూడు ప్రాజెక్టుల శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పోటెత్తారు. సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్యాలరీలన్నీ కిటకిటలాడా యి. దీంతో కొంత మందిని ప్రాంగణానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వింగ్స్ లోకి జనాలను పోలీసులు పంపించారు.

అభిమానులకు అభివాదం చేస్తూ...

ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, సీనియరు నాయకులు, జిల్లా ఉన్నతాధికారుల స్వాగతం మధ్య ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 10.55 గంటలకు బహిరంగసభ వేదికపైకి వచ్చారు. సభకు విచ్చేసిన విశేష జనవాహినికి, అభిమానులకు అభివాదం చేశారు. వేదికపై ఏర్పాటుచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్వాగతోపన్యాసం చేశారు. తర్వాత నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఉద్వేగంగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, చింతపల్లి ఫిష్‌ల్యాండింగ్ సెంటర్, తారకరామతీర్థ సాగరం... ఈ మూడు ప్రాజెక్టులు జిల్లా ముఖచిత్రాన్ని భవిష్యత్తులో ఏవిధంగా మార్చేయనున్నదీ వివరించారు. భోగాపురం విమానాశ్రయానికి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేరుపెట్టాలని కోరారు. టెర్మినల్స్‌కు సీనియర్ నాయకులైన కొమ్మూరు అప్పుడుదొర, పెనుమత్స సాంబశివరాజు పేర్లు పరిశీలించాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మించి సొంత ప్రాంత రుణం తీర్చుకోడానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని గ్రంధి మల్లికార్జునరావు సభావేదికపై నుంచి ధన్యవాదాలు తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో, రెండు రన్‌వేలతో, విశాలమైన కార్గో వసతితో నిర్మించే ఎయిర్‌పోర్ట్ అన్నివర్గాల అభివృద్ధికీ దోహదం చేస్తుందని వివరించారు. ఈ విమానాశ్రయం నిర్మాణాన్ని శరవేగంతో పూర్తి చేస్తామని, ప్రారంభోత్సవానికీ తమరు రావాలంటూ ముఖ్యమంత్రికి జీఎంఆర్ ఆహ్వానం పలికారు.



పునాదిరాయి వేశా.. నేనే ప్రారంభిస్తా..

అన్ని అడ్డంకులు తొలగించి కేంద్రం నుంచి అనుమతులన్నీ తెచ్చి, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించిన తర్వాతే భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తున్నట్టు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. చంద్రబాబులా ఎలాంటి అనుమతుల్లేకుండా, భూసేకరణ చేయకుండా టెంకాయ కొట్టేసి వెళ్లిపోనని వ్యంగ్యంగా అన్నారు. విమానాశ్రయ నిర్మాణాన్ని 24 నెలల్లో పూర్తి చేయగలరా? అని జీఎంఆర్‌ను అడిగానని, ఆయన 24 నెలల నుంచి 30 నెలల్లో పూర్తి చేస్తానన్నారని చెప్పారు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికీ రావాలన్న జీఎంఆర్ ఆహ్వానంపై ముఖ్యమంత్రి స్పందించారు. ప్రజలు అండదండలతో, దేవుడి ఆశీస్సులతో 2026 సంవత్సరంలో తానే విమానాశ్రయాన్ని ప్రారంభిస్తాననడంతో సభ హర్షధ్వానాలతో మార్మోగింది. జేఎన్‌టీయూను జేఎన్‌టీయూ గురజాడ-విజయనగరం వర్సిటీగా మార్పుచేసిందీ తానేనని గుర్తు చేశారు. కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నామని, దాన్నీ జూన్-జూలై నెలల్లో ప్రారంభిస్తానని చెప్పారు. సాలూరులోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి భూసేకరణ పూర్తి చేశామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని స్పష్టం చేశారు.

విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నామని, ఆగస్టులో తాను వచ్చి ప్రారంభోత్సవం చేస్తానని వెల్లడించారు. అన్నింటికీ మించి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన విశాఖ నగరంలో సెప్టెంబర్ నుంచి కాపురం ఉంటానని సీఎం చెప్పడంతో సభ అంతా చప్పట్లతో మార్మోగింది. మొత్తంమీద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన వరాల జల్లుతో విజయవంతమైంది.

సీఎం పర్యటన సాగిందిలా...

నెల్లిమర్ల: జిల్లాలోని భోగాపురం విచ్చేసిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ప్రశాంతంగా సాగింది.

ఉదయం 10.15 గంటలకు: సీఎం హెలికాప్టర్‌లో సవరవిల్లి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు.

10.35కు: జీఎంఆర్ ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరీయన్స్ సెంటర్‌ను సందర్శించారు.

10.45కు: భోగాపురం ఎయిర్‌పోర్ట్, చింతపల్లి ఫ్లోటింగ్ జెట్టీ, తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు మిగులు పనులకు శంకుస్థాపన చేశారు.

10.55కు: సభా వేదికపైకి చేరుకున్నారు.

10.57కు: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

11.20 నుంచి 12 గంటల వరకు: బహిరంగ సభలో ప్రసంగించారు.

12 నుంచి 12-10 గంటల వరకు: సీఎంకు జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లిఖార్జునరావు, జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకుల సత్కారం.

12.10కు: బయలుదేరి తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు.

12.10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు: పలువురు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు హెలికాప్టర్‌లో విశాఖపట్టణం వెళ్లారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఎం, జీఎంఆర్



చింతపల్లి ఫోటింగ్‌జెట్టీ, రామతీర్థసాగర్ పనులు ప్రారంభిస్తున్న సీఎం

నెల్లిమర్లపై వరాల జల్లు

నెల్లిమర్ల: ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా భోగాపురం విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లిమర్ల నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సభా ముఖంగా నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను ప్రస్తావించారు. సమస్యలు పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని సీఎంకు విన్నవించారు. స్పందించిన జగన్‌మోహన్‌రెడ్డి సమస్యలు పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు సభలోనే ప్రకటించారు.

- పూసపాటిరేగ మండలం కందివలస గెడ్డపై వంతెన నిర్మాణంతో పాటు చింతపల్లి, మెంటాడ గ్రామాల మధ్య రహదారి నిర్మాణానికి రూ. 10 కోట్లు మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు.
- డెంకాడ మండలం దారపురెడ్డిపాలెం గ్రామ పరిధిలో చంపావతి నదిపై కాజ్‌వే నిర్మాణానికి రూ.2కోట్లు కేటాయిస్తానని తెలిపారు.
- భోగాపురం మండల కేంద్రంలో బట్టీ కాలువ మరమ్మతు పనులకు అదనంగా రూ.1.8 కోట్లు మంజూరు చేస్తామన్నారు.
- భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని 45 తీర ప్రాంత గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పథకాల ఏర్పాటుకు రూ. 35 కోట్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు.
- నెల్లిమర్ల మండలం తుమ్మలపేట-గరికిపేట గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, కొండవెలగాడ-రోళ్లవాక గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి మరో రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించడంతో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

నెల్లిమర్ల రూరల్/డెంకాడ: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రావివలస సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మంత్రులు బొత్ససత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, రెడ్డి శాంతి, అలజంగి జోగారావు, కంబాల జోగులు, పుష్ప శ్రీవాణి, ఎస్.శంకరరావు, గొర్లె కిరణ్, ఎమ్మెల్సీలు పెనుమత్స వరహా వెంకట సూర్యనారాయణరాజు, ఇ.రఘురాజు, పాలవలస విక్రాంత్, వరుదు కల్యాణి, ఏపీ మారిటోరియం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, శిష్టకరణం కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అనూషా పట్నాయక్, నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ ఎంపీ కిల్లికృపారాణి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, తూర్పుకాపు రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్, డీసీఎం ఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, భోగాపురం మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శివారెడ్డి, సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, కందుల రఘుబాబు తదితరులున్నారు. సీఎం జగన్ ప్రతీ ఒక్కరిని పేరు పేరున ఆప్యాయంగా పలకరించారు. సీఎం కార్యక్రమాల్లో భోగాపురం ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, పూసపాటిరేగ ఎంపీపీ మహంతి కళ్యాణి, పూసపాటిరేగ, భోగాపురం జెడ్పీటీసీలు మహంతి సీతాలక్ష్మి, పడాల మంజులత, భోగాపురం, పూసపాటిరేగ మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పతివాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్ అంటూ ప్లకార్డులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



జోరువానలోనూ అభిమాన నేతకు జేజేలు



ముఖ్యమంత్రికి జ్ఞాపికను బహూకరిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ, కలెక్టర్, జేసీలు



అభిమాన నేతకు చిరుజ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 1 నుంచి తిరుపతి వేదికగా జరుగుతున్న పోటీల్లో 100 మీటర్ల పరుగు పోటీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్.గణేష్ బంగారు పతకం దక్కించుకోగా..జావెలిన్ త్రోలో జి.ఈశ్వరరావు బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా 800 మీటర్ల పరుగు పోటీలో పి.సాయి రజత పతకం, 100 మీటర్ల పరుగు పోటీలోబి.లక్ష్మి. హైజంప్‌లో జి.లక్ష్మి కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను ఆయన అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - సంక్షిప్త సారాంశం

EFS & T డిపార్ట్‌మెంట్, విజయనగరం జిల్లా & పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం డివిజన్ మరియు పార్వతీపురం డివిజన్ పరిధిలో అటవీ భూమి నందు బి.టి.రోడ్లు నిర్మించుటకు 6.64 హెక్టారులు అటవీ భూమి కార్యనిర్వాహక ఇంజనీరు, పి.ఆర్.(పి.ఐ.యు.) విభాగము, విజయనగరం పేరున మళ్లింపు చేయుటకుగాను తుది ఉత్తర్వులు జారీ చేయుట.

పర్యావరణ, అడవులు, శాస్త్రీయ మరియు సాంకేతిక (విభాగం -1) శాఖ

1. PCCF & HOFF ఆంధ్రప్రదేశ్ లేఖ సంఖ్య, EFS02 - 15034/03/14/2020-2021/FCA SEC-PCCF/FCA-3. తేది 04.07.2022, మరియు 24.01.2023.
2. GOI, MoEF & CC, IRO, విజయవాడ. Lr.F.No.4-APB175/2022-VI/397, తేది.07.06.2022. 2-15034/14/2021/-/3, 24.01.2023.

వరుస సంఖ్య	రోడ్డు పేరు	మళ్లింపు అటవీ భూమి హెక్టారులలో	అటవీ డివిజన్ పేరు
1.	పాచిపెంట మండలంలో వేటగానివలస - తల్లగుల రోడ్డు 9/0 నుండి ముటుకుల గ్రామమునకు వయా బొడ్డపాడు తారు రోడ్డు నిర్మాణం	2.75	పార్వతీపురం మన్యం క్రొత్త జిల్లా
2.	పాచిపెంట మండలంలో ఆలూరు నుండి మోదుగ గ్రామమునకు వయా గాదెలవలస తారురోడ్డు నిర్మాణం	1.47	పార్వతీపురం మన్యం క్రొత్త జిల్లా
3.	జామి మండలంలో కేసాయవలస నుండి రోడ్ 13/7 వయా బట్టివలస, వెంకట రాయుడుపేట, బొడ్డవలస, వెలగవలస, విస్సులపాడు గ్రామమునకు తారురోడ్డు నిర్మాణం	2.42	విజయనగరం
		6.64	

ఉత్తర్వులు : పై 1 వ సూచిక ననుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బి.టి. రోడ్లు నిర్మించుటకు విజయనగరం జిల్లా మరియు పార్వతీపురం జిల్లా, విజయనగరం మరియు పార్వతీపురం డివిజన్ పరిధిలో 6.64 హెక్టారులు అటవీ భూమిని కార్యనిర్వాహక ఇంజనీరు, పి.ఆర్.(పి.ఐ.యు.) డివిజన్, విజయనగరం వారి పేరున మళ్లించుటకు అడవుల ప్రిన్సిపాల్ ముఖ్య సంరక్షణ అధికారి మరియు అటవీ దళం ప్రధానాధికారి, ఆంధ్రప్రదేశ్ వారు ప్రతిపాదనలు దాఖలు పరిచినారు మరియు పై 2వ సూచిక ననుసరించి పర్యావరణము, అడవులు శాస్త్రీయ మరియు సాంకేతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారిచే జారీ చేయబడిన మార్గదర్శకములకు అనుగుణంగా అనుమతి అభ్యర్థించారు.

సదరు ప్రతిపాదనలో ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించిన అనంతరం మరియు పై 2వ సూచిక ప్రకారం పర్యావరణము, అడవులు శాస్త్రీయ మరియు సాంకేతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారిచే జారీ చేయబడిన మార్గదర్శకములు అనుసరించి రాష్ట్ర ప్రభుత్వమునకు అధికారములు సంక్రమింపచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయనగరం డివిజన్ పరిధిలో అటవీ భూమి గుండా బి.టి. రోడ్డు నిమిత్తం 6.64 హెక్టారుల భూమిని కార్యనిర్వాహక ఇంజనీరు, పి.ఆర్.(పి.ఐ.యు.) డివిజన్, విజయనగరం వారి పేరున మళ్లించుటకు అడవుల ప్రిన్సిపాల్ ముఖ్య సంరక్షణ అధికారి మరియు అటవీ దళం ప్రధానాధికారి, ఆంధ్రప్రదేశ్ వారు ఈ క్రింది షరతులకు లోబడి అనుమతి మంజూరు చేయడమైనది.

- i. చట్టపరమైన అటవీ భూమిని మళ్లింపుతో మార్చులేదు.
- ii. బదలాయింపు చేయుటకు ప్రతిపాదించబడిన అటవీ భూమి సరిహద్దును 20 మీ. దూరంలో వెంబడింగ్ చేయబడిన 4 అడుగుల ఎత్తు సిమెంట్ కాంక్రీట్ స్తంభము, యూజర్ ఏజెన్సీ సొంత నిధులతో ఏర్పాటు చేయవలెను.
- iii. జోట మండలం, పెదఖండేపల్లి గ్రామంలోని సర్వే సంఖ్య 108 లో గుర్తించబడిన అటవీ స్థలంలో, రాష్ట్ర అటవీ విభాగం మొక్కలు నాటి మరియు వాటి సంరక్షణను, యూజర్ ఏజెన్సీ నిధులతో చేపట్టవలెను.
- iv. ఒక హెక్టారుకు వెయ్యి మొక్కలు నాటలేని పరిస్థితిలో, మిగిలిన మొక్కలను రాష్ట్ర అటవీ విభాగం, దగ్గరలోని డిగ్రేడ్ అటవీ స్థలంలో చేపట్టవలెను డిగ్రేడెడ్ అటవీ స్థలం వివరములను i.e., మ్యాప్, kml ఫైల్స్ మొదలగునవి కంప్లైంట్ రిపోర్ట్ తో సమర్పించి మరియు సదరు వివరములను వెబ్ పోర్టల్ లో అప్లోడ్ చేయవలెను.
- v. ముందస్తు కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా, కంపన్సేటరి అఫారెస్టేషన్ నిమిత్తం గుర్తించబడిన అటవీ భూమి కానీ స్థలంలో మార్పులు చేపట్టరాదు. కంపన్సేటరి స్థలం హద్దులను గుర్తించి, ఆక్రమణలు జరగకుండా స్థానిక గ్రామ ప్రజలకు తెలియజేయవలెను.
- vi. జోట మండలం, పెదఖండేపల్లి గ్రామంలోని సర్వే సంఖ్య 108 లో గుర్తించబడిన అటవీ భూమి రానీ 8.42 హెక్టారులను కంపన్సేటరి అఫారెస్టేషన్ చేపట్టుటకు రాష్ట్ర అటవీ విభాగానికి బదలాయింపు చేసి, స్టేజ్-II అనుమతులు రాకముందు రిజర్వ్ అటవిగా గుర్తించవలెను.
- vii. గౌరవ సుప్రీం కోర్టు, తే.28.03.2008 దీ మరియు తే.09.05.2008దీ IA సంఖ్య 826 మరియు 566 సంబంధించిన IA రిట్ పిటిషన్ (సివిల్) సంఖ్య 202 యొక్క 1995 మరియు మంత్రిత్వ శాఖ గైడ్ లైన్స్ సంఖ్య 5-3 /2011-FC(VOL-I) తే.06.01.2022దీ. మరియు లేఖ తే.19.01.2022దీ. వివరణ మరియు ఆదేశముల మేరకు మళ్లించిన అటవీ భూమికి నికర ప్రస్తుత విలువ (NPV) ను యూజర్ ఏజెన్సీ నుండి రాష్ట్ర ప్రభుత్వం చార్జ్ చేయవలెను.
- viii. భవిష్యత్తులో, గౌరవ సుప్రీం కోర్టు ఏదైనా సవరించిన మొత్తమును సదరు జరుసత్తు మొత్తము, మళ్లించిన అటవీ భూమికి సంబంధించిన నికర ప్రస్తుత విలువ (NPV), రాష్ట్ర ప్రభుత్వము యూజర్ ఏజెన్సీ నుండి చార్జ్ చేయవలెను. దీనికి సంబంధించి యూజర్ ఏజెన్సీ ధృవీకరణ పత్రము సమర్పించవలెను.
- ix. యూజర్ ఏజెన్సీ ద్వారా సేకరించబడిన అన్ని మొత్తములు CAMPA మొత్తమునకు ఈ-పోర్టల్ ద్వారా జమచేయవలెను.
- x. మళ్లించిన అటవీ భూమిలో చెట్లు పడిపోకుండా చూడవలెను.
- xi. యూజర్ ఏజెన్సీ యొక్క నిధులతో, అటవీ విభాగం అవసరం అని తలచిన ప్రాంతంలో కోతకు గురికాకుండా సరైన SMC పనులు చేపట్టవలెను.
- xii. ప్రాజెక్టు నిధులతో అవసరమైన జోట అటవీ అధికారులతో సంప్రదించి యూజర్ ఏజెన్సీ రక్షిత గోడను నిర్మించవలెను.
- xiii. పశు ప్రాణులు తిరుగుటకు ఆటంకము లేకుండా మరియు నీటి గుంటలు ఏర్పడకుండా, సహజ నదులు, కాలువల వద్ద కల్వర్టు మరియు వంతెనలు నిర్మించవలెను.
- xiv. జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు, మట్టిని త్రవ్వ పరిచేందుకు రహదారుల పక్క మట్టిని తవ్వి మరియు నింపవలెను.
- xv. ఎక్కువగా తవ్విన మట్టిని అటవీ ప్రదేశములో వేయరాదు. ఏ రకమైన వస్తువులను అటవీ ప్రదేశములో నిలువ చేయరాదు.
- xvi. కేంద్ర ప్రభుత్వము అనుమతి లేకుండా లే ఔట్ ప్లాన్ లో మార్పులు చేయరాదు.
- xvii. పని చేయు ప్రదేశములో పని వారలకు వంట చేరుకును యూజర్ ఏజెన్సీ సమకూర్చవలెను మరియు అటవీ ప్రదేశములో పని వారు ఉండుటకు చేపట్టరాదు.
- xviii. పనివారు మరియు నియమించబడిన సిబ్బంది వలన అటవీ సంపదకు భంగము కలగకుండా, యూజర్ ఏజెన్సీ బాధ్యత తీసుకోవలెను.

పై పనులకు అటవీ భూమి 6.64 హెక్టారులకు మించరాదు మరియు కేటాయించబడిన పనులకు కాకుండా ఇతర పనులకు పై అటవీ భూమిని ఉపయోగించరాదు. పై విషయమై యూజర్ ఏజెన్సీ ధృవీకరణ పత్రం సమర్పించవలెను.

- xix. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితులలోను మళ్లించిన అటవీ భూమిని ఇతర సంస్థలకు బదలాయింపు చేయరాదు.
- xx. ప్రాజెక్టు పని నిర్మించుటకు కావలసిన వస్తువులను సేకరించడానికి, అదనపు లేదా క్రొత్త దారును అటవీ ప్రదేశంలో నిర్మించరాదు.
- xxi. ప్రాజెక్టు పనికి సంబంధించిన అన్ని నియమ నిబంధనలు మరియు గైడ్ లైన్స్ ను యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్ర ప్రభుత్వము తెలుసుకొనవలెను.
- xxii. కేంద్ర ప్రభుత్వము ప్రాంతీయ అధికారి (కేంద్రం) Integrated Regional office, విజయవాడ, అటవీ సంపద సంరక్షణకు సంబంధించి ఏదైనా ఇతర షరతులు విధించవచ్చును.
- xxiii. పై షరతులకు యూజర్ ఏజెన్సీ విఫలం చెందిన యెడల FCA 1980 గైడ్ లైన్స్ ప్రకారం, యూజర్ ఏజెన్సీ పై చర్యలు తీసుకొనబడును.
- xxiv. ఆన్ లైన్ ద్వారా పై షరతులను, రాష్ట్ర ప్రభుత్వము కంప్లైంట్ రిపోర్ట్‌ను సమర్పించవలెను. (https://parivesh.nic.in).

పై తెలిపిన షరతులపై కంప్లైంట్ రిపోర్ట్ చేసిన పిదప, ప్రతిపాదనల అంతిమ మంజూరుకు పరిశీలించబడును. ఈ లేఖ అందిన పిదప, సదరు మంజూరు 5 సంవత్సరముల వరకు చెల్లుబడును.

సం/- యం.వి.ఆర్.కృష్ణాజీ, కార్యనిర్వాహక ఇంజనీరు,
పి.ఐ.యు. డివిజన్, పార్వతీపురం

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో బుధవారం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలియజేసిన మేరకు ఆయా ప్రమాద సంఘటనల వివరాలిలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: మోహన్‌రావు మృతదేహం

కురుపాం మండలం గుమ్మ గ్రామానికి చెందిన నాందేడ మోహన్‌రావు (40) మామిడి పళ్ల కోసం చెట్టు ఎక్కి కోస్తుండగా, కొమ్మ విరిపోవడంతో జారిపడ్డాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు మోహన్‌రావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భద్రగిరి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

విద్యుత్ తీగలు తగిలి పశువుల కాపరి..

చీపురుపల్లి మండలంలోని ఇటకర్లపల్లి పంచాయతీ పరిధి పోతాయవలస గ్రామానికి చెందిన యువకుడు సుబుద్ధి రామారావు(30) గ్రామానికి సమీపంలో పశువులు మేపుతుండగా విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు చేతికి తగలడంతో షాక్ కొట్టి మృతిచెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న పెద్ద కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

భామిని మండలం పసుకుడికి చెందిన రవి గౌడో(33) మంగళవారం రాత్రి భామిని నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురై రోడ్డుకు తల ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. వెనుకగా వస్తున్న గ్రామస్తులు ప్రమాదాన్ని గుర్తించి 108 అంబులెన్స్‌లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందాడు. బత్తిలి ఎస్సై యతిరాజుల అమ్మనరావు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



భామిని:మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అమ్మనరావు

రైలు ఢీ కొని గుర్తు తెలియని మహిళ..

చెన్నై నుంచి హౌరా వెళ్లే రైల్వే మార్గంలో కొత్తవలస మండలం మంగళపాలెం జంక్షన్ వద్ద సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మహిళ రైల్వే ట్రాక్ దాటుతుండగా విశాఖ వైపు వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టింది. దీంతో ఆమె శరీరభాగాలు పూర్తిగా నుజ్జు నుజ్జయి చిందర వదనగా పడిపోవడంతో చనిపోయిన మహిళను గుర్తుపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. జీఆర్‌పీ ఎస్సై టి.కామేశ్వరరావు శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి మృతదేహం భాగాలను విజయనగరం రైల్వే ఆస్పత్రికి తరలించారు.

ఆశ్రమ విద్యార్థిని ఆదుకున్న ఆరోగ్యశ్రీ



ఆపరేషన్ అనంతరం డిశ్చార్జ్ అయిన విద్యార్థి

- బాలుడి గుండెకు శస్త్రచికిత్స చేసి కాపాడిన వైద్యులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

సీతంపేట: బిడ్డ బాగా చదువుకోవాలని స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 4వ తరగతిలో చేర్పించారు తల్లిదండ్రులు. ఇక్కడే భోజన, వసతి సౌకర్యాలు ఉండడంతో బాగా చదువుకుంటున్నాడు. ఇంతలో పిడుగులాంటి సమాచారం తెలియడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఆరోగ్య శ్రీ అండగా నిలిచింది. వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం చినఖేర్జ గ్రామానికి చెందిన పువ్వల కృష్ణమూర్తి అనసూయలకు ముగ్గురు పిల్లలు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆ కుటుంబం కువ్వల యశ్వంత్‌ను సీతంపేటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలో 4వ తరగతిలో చేర్పించింది. తమ కుమారుడు ఆరోగ్యంగా ఉండి అందరితో కలివిడిగా ఉంటూ చదువులో కూడా మంచి తెలివితేటలు ప్రదర్శించడంతో తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. కొద్ది రోజుల కిందట డెంగీ జ్వరం రావడంతో పాఠశాల సిబ్బంది స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అసలు విషయం బయట పడింది. గుండెకు రంధ్రం ఉందని వెంటనే అవసరమైన శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. వెంటనే పాఠశాల సిబ్బంది అప్రమత్తమై తల్లిదండ్రులకు సమాచారమిచ్చి శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

అక్కడ వైద్య పరీక్షల అనంతరం ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. విశాఖపట్నంలోని స్టార్ పినాకిల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆ ఆస్పత్రిలో గత నెల 25న చేసిన ఆపరేషన్ సక్సెస్ అయింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రరావుతో పాటు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బాలుడి పరిస్థితిని పర్యవేక్షించారు. విద్యార్థికి ఆపరేషన్ విజయవంతమైందని తెలుసుకున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదంటూ విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆ విద్యార్థిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

టీటీడీ చైర్మన్‌కు ఘనంగా స్వాగతం

- కల్యాణ మంటపం సౌకర్యాలపై వినతి

చీపురుపల్లి: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం రాత్రి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చీపురుపల్లి పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో టీటీడీ కల్యాణ మంటపం నిర్మాణం జరిగిందని ప్రస్తుతం అక్కడ వసతి సమస్యతో పాటు ఇతర ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించి టీటీడీ కల్యాణ మంటపాన్ని ఆధునీకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ఉన్నారు.



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబసభ్యులు

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- పార్వతీపురం మన్యం కలెక్టర్ నిషాంత్ కుమార్



ఎగువతాడికొండ గ్రామంలో అంగన్వాడీకేంద్రం గడపలో కూర్చుని రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

గుమ్మలక్ష్మీపురం: విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈమేరకు బుధవారం ఆయన మండలంలోని తాడికొండ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఎగువ తాడికొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రం గడపలోనే కూర్చుని రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డుల నమోదుకు వాస్తవ వివరాలకు తేడాలు గమనించిన కలెక్టర్ సిబ్బందిని ప్రశ్నించారు. ప్రసవించిన తల్లుల వివరాలు లేకపోవడం, తప్పులు నమోదు చేయడం, ప్రసవించి నాలుగు రోజులైనప్పటికీ యాప్‌లో నమోదు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇచ్చిన వివరాలలో తేడాలు గమనించిన కలెక్టర్ ఇకపై ఇదే విధంగా విధులు నిర్వహిస్తే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎం, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామంలో రక్తహీనత గల పిల్లలు, తల్లుల వివరాలు తెలుసుకుని వారి సంఖ్య తగ్గించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన తల్లులతో మాట్లాడుతూ ఐరన్ మాత్రలు, పౌష్టికాహార పదార్థాల కిట్, గుడ్లు సకాలంలో ఇస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు.

ఆహార పదార్థాల తయారీలో అప్రమత్తం

ఆరోగ్యంపై తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారా? అని ఆరా తీశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఆహార పదార్థాల తయారీలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది హాజరు పట్టీ, ప్రసవం జరిగిన వివరాలు, చికిత్స పొందుతున్న వారి వివరాలు పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి కె.విజయగౌరి, తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంపీడీఓ సాల్మన్‌రాజు ఉన్నారు.

నేటి నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు

- జేసీ మయూర్ అశోక్



విజయనగరం అర్బన్: రబీ పంట కాలంలో 2,07,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి రానుంది. ప్రస్తుతం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న కనీస మద్దతు ధరకు కాకుండా తక్కువకు రైతులు అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లాజాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నను కనీస మద్దతు ధర కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాయగా మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ మేరకు గురువారం నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని తెలిపారు. మొక్కజొన్న అమ్మదలచిన రైతులు తమ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని జేసీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

బట్టల షాపులో చోరీ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలో ఉన్న కేటీఆర్ రెడీమేడ్ బట్టల షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీకి జరిగినట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపు పైభాగాన రేకులు తొలగించి లోపలికి దిగి చీరలు, ప్యాంట్లు ఇతర వస్త్రాలతో పాటు, రూ.12వేలు దొంగిలించినట్లు యజమాని కనిమొరక తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వచ్చి షాపును పరిశీలించినట్లు చెప్పారు. క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో ఎస్సై మురళీమోహన్, శారద వచ్చి ఆధారాలు సేకరించినట్లు చెప్పారు.



చోరీ జరిగిన షాపులో పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

జాతీయస్థాయి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: సర్వేజనా సుఖినోభవంతు సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో మట్టిలో మాణిక్యాలైన విద్యావంతులు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు తదితర ప్రతిభావంతులకు జాతీయస్థాయి పురస్కారాలు అందజేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇఎస్ఎస్.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా భూషణ్, సేవా భూషణ్, ప్రతిభా భూషణ్ 2023 జాతీయస్థాయి పురస్కారాలను అందజేసి, వారి సేవలను, ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మే 21న ఆదివారం హైదరాబాద్‌లో సంస్థ ఆరో వార్షికోత్సవంలో పురస్కారాలను అందజేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారందరూ 9652347207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	61,640–00
బంగారం(22కే. 10గ్రా.)	56,500–00
వెండి (కిలో)	81,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹137	₹244	₹ 254

ఇరువర్గాల కొట్లాట

పార్వతీపురం: భూమి హక్కుల విషయం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. దీనిపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం బురద వెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స పెంటంనాయుడు, వరుసకు పెదనాన్న కుమారులు శ్రీహరినాయుడు తదితరుల మధ్య పదేళ్లుగా భూమి హక్కులపై తగువులు జరుగుతున్నాయి. భూమి హక్కుల విషయమై తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఇరువర్గాల వారిని పిలవగా కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 265/12లో 0–10 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నారని పెంటంనాయుడు రెవెన్యూ అధికారుల ఎదుట వివరించగా, ఆ భూమిని పెంటంనాయుడు గతంలో విక్రయించాడని శ్రీహరినాయుడు తెలిపారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఈఘటనలో శ్రీహరినాయుడు, సత్యంనాయుడు, ఈశ్వరరావు తదితరులు పెంటంనాయుడిని పలుచోట్ల గాయపరిచారు. గాయపడిన పెంటంనాయుడును కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.



చికిత్స పొందుతున్న పెంటంనాయుడు

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



వి.రాకేష్

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఉంటున్న శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి చెందిన వి.రాకేష్(21) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సాయంత్రం 6.30 గంటల సమయంలో రాకేష్ తోటి విద్యార్థులతో ఈ నెల 2న వసతిగృహంలోని తన గదికి వెళ్తూనే ఒక్కసారిగా సెకండ్ ఫ్లోర్ నుంచి కిందకు దూకాడు. దీంతో అతనిని వెంటనే ట్రిపుల్‌ఐటీ ఆవరణలోనే ఉన్న ఆస్పత్రికి, అక్కడి నుంచి ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. రాకేష్‌ది విజయనగరం జిల్లాలోని గొలిజం స్వగ్రామం. మూడు రోజులుగా అతను ముభావంగా ఉంటున్నాడని తోటి విద్యార్థులు ఫ్యాకల్టీకి చెప్పడంతో మంగళవారం రెండు గంటల సేపు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 4న విద్యార్థులందరూ ఇంటికి వెళ్తుండగా, ఇంతలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమా? ఇంకేమైనా కారణముందా అనే దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.22 వేలు మాయం



బాధితుడు ఉగిరి లక్ష్మణరావు

వీరఘట్టం: తన బ్యాంకు ఖాతా నుంచి రూ.22 వేలు మాయమైనట్లు మండలకేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఉగిరి లక్ష్మణరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం యూనియన్ బ్యాంకులో ఉన్న తన ఖాతా నుంచి మంగళవారం మధ్యాహ్నం రూ.2 వేలు, రాత్రి మరో రూ.10 వేలు, అలాగే బుధవారం ఉదయం రూ.10 వేలు మొత్తం రూ.22 వేలు గుర్తు తెలియని వ్యక్తులు విత్ డ్రా చేసినట్లు ఆయన స్థానిక యూనియన్ బ్యాంకులో ఫిర్యాదు చేశారు. దీంతో బ్రాంచ్ మేనేజర్ వెంటనే ఆయన ఖాతాను బ్లాక్ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని బీఎం తెలిపారు. బాధితుడి ఆధార్ కార్డు ఆధారంగా కస్టమర్ సర్వీసు సెంటర్‌లో ఎవరో విత్ డ్రా చేసి ఉంటారని ఆయన తెలిపారు. అయితే ఈ బ్యాంకులో గతంలో కూడా కొందరి అకౌంట్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు విత్ డ్రాలు చేసిన సందర్భాలు ఉన్నాయి.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు



బొబ్బిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పలస్వామి, ఈశ్వరమ్మ

బొబ్బిలి: మండలంలోని కోమటి పల్లి వద్ద ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో చిలకల పల్లికి చెందిన చింతాడ అప్పలస్వామి, కలువరాయికి చెందిన వెంపలి ఈశ్వరమ్మ గాయపడ్డారు. వారిలో అప్పలస్వామిని మెరుగైన చికిత్స కోసం బొబ్బిలి సీహెచ్‌సీ నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

బైక్‌ను కారు ఢీకొని మరో ఇద్దరికి..

బొండపల్లి: మెంటాడ మండలం, జీడివలస గ్రామానికి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మండలంలోని గరుడుబిల్లి జంక్షన్ జాతీయ రహదారిపై విజయనగరం నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. దీంతో వారిని విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి 108 వాహనంలో చికిత్స కోసం తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారా?
అయితే ఈ అవకాశం మీ కోసమే!! అమరావతి ఫిన సురక్ష నిధి - (క్యాపి బ్యాంకింగ్) - విజయనగరం బ్రాంచ్‌లో పనిచేయుటకు ఉద్యోగులు కావలెను
ఇంటర్మీడియట్ పాస్, వయసు : 25 సం॥ల నుంచి 30 సం॥ల వరకు
07-05-2023 (ఆదివారం)న జరిగే వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకాగలరు
అమరావతి ఫిన సురక్షనిధి లిమిటెడ్
ఫస్ట్ ఫ్లోర్, షైల్ల అవెన్యూ, మయూరి జంక్షన్ దగ్గర, విజయనగరం. 93929 15966

PLOT FOR SALE

■ గ్రేటర్ విశాఖలో 5 లక్షలకే 116 గజాలు ఇంటి స్థలం 150, 200 గజాలు, 24 బిట్లు గలవు. గాజువాకకి 15 కి.మీ.లో స్పాట్ రిజిస్ట్రేషన్, EMI కలదు. ఫోన్ : 73864 14017 [V.794456]

WANTED

■ హైదరాబాద్‌లోని ఆప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Ceretakers కావలెను.జీతం॥16–18వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ గలవు. +91 6300813664 [G.554]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786210]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000– 20,000/– వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర॥ 9346032628 [G-786216]

■ విశాఖపట్నంలో ప్రముఖ ఓల్డేజ్ హోమ్‌కి వృద్ధులకు సేవ చేయుటకు 24 గంటలు ఆడ/మగ & వంట మనిషి (స్త్రీ) కావలెను. ఉచిత భోజనం & వసతి ఇవ్వబడును. ఫోన్ : 99899 93756 [V.772]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995984445 [HA-114]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 16K-18K. విజయవాడ ఫోన్ : 9640528899 / 9640648899 [HA-99]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-10756]

■ బ్యాంక్స్‌లో పర్మినెంట్‌గా (Office work) ఖాళీలు : 210 Q: 10th-డిగ్రీ, కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, క్యాషియర్స్, PO's జీ॥ 24000/– Ph:7816010774 [H-781419]

■ హైదరాబాద్, హోటల్లో క్లీనింగ్/సర్వీస్/కిచెన్‌లో చేయుటకు బాదరబందీలేని 25–40 సం.లోపు ఆడ & మగ వారు కావలెను. జీ: 12 వేలు+భోజనం+వసతి. సంప్ర: 7702348888 [HA-13750]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.